

నానో యూరియాతో అనేక ప్రయోజనాలు

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని రైతులకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జనగామ కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులకు నానో టెక్నాలజీపై అవగాహన సదస్సు నిర్వహించగా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరై పాల్గొని మాట్లాడారు. సంప్రదాయ యూరియా వాడడం వల్ల పర్యావరణ కాలుష్యం, భూగర్భ జలవనరులకు ఇబ్బంది కలగడమే కాకుండా నేలకు కూడా నష్టం కలుగుతుందన్నారు. నానో యూరియా అనేది టెక్నాలజీ సహాయంతో తయారు చేయబడిన ద్రవ రూపంలో ఉండే ఎరువు అని దీనిని వాడకం వల్ల అనేక ప్రయెజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీ ఏవో అంబికా సోని, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి ఉదంతంపై పోలీసుల ఆరా

జనగామ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడి అప్పులు ఎక్కువై రాత్రికే రాత్రే ఉడాయించిన వ్యాపారి ఉదంతంపై పోలీసులు బుధవారం విచారణ చేపట్టారు. ఉడాయించిన వ్యాపారి జనగామ వ్యవసాయ మార్కెట్ ప్రాంతానికి చెందిన వాడు కావడంతో అక్కడి వ్యాపారులను అడిగి పోలీసులు వివరాలు సేకరించారు. కాగా.. వ్యాపారి అప్పులు పాలు కావడానికి ప్రధాన కారణంగా ఆన్‌లైన్ రమ్మీ ఆట అని ప్రచారం జరుగుతుండడంతో పోలీసులు సీరి యస్‌గా పరిగణిస్తున్నారు. ఆన్‌లైన్ రమ్మీకి ప్రోత్సహించిందెవరు? ఇంకా ఎవరైనా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారా? అని ఆరా తీస్తున్నారు.

నిధుల వరద

రాబోయే మేడారం మహా జాతరకు రూ.150 కోట్ల కేటాయింపు

- వీటిలో ఐదు కీలక శాఖలకు రూ.90.87 కోట్ల నిధులు
- ఈ సారి ఐదు నెలల ముందే నిధులు విడుదల
- పారదర్శకంగా, శాశ్వత, నాణ్యతతో పనులు చేపట్టేందుకు అవకాశం
- 2024 జాతరకంటే రూ.45 కోట్లు నిధులు అదనం
- జనవరి 28నుంచి 31వ తేదీ వరకు జరగనున్న మహాజాతర
- కోటిన్నర మందికి పైగా భక్తులు వస్తారని అంచనా



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు ప్రభుత్వం రూ.150కోట్ల నిధులను కేటాయించింది. వీటిలో కీలకమైన పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, ఇరిగేషన్, గిరిజన సంక్షేమశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్(పారిశుధ్యం) శాఖలకే రూ.90.87కోట్ల నిధులు కేటాయించారు. వచ్చే ఏడాది జనవరి 28వ తేదీ నుంచి నాలుగురోజుల పాటు జరిగే మహాజాతరకు కోటిన్నర మందికి పైగా భక్తులు పాల్గొంటారనే అంచనాలతో ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించటంతో పాటు ప్రశాంతంగా తల్లులను దర్శించుకునేలా ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయింపులు చేసింది. ఐదు నెలల ముందే నిధులు విడుదల కావటంతో నాణ్యతతో పనులు నిర్వహించేలా అధికార యంత్రాంగం దృష్టి పెట్టే అవకాశం ఉంది. పదేళ్ల తరువాత భారీ మొత్తంలో నిధులు కేటాయింపులు చేయటంతో హర్షం వ్యక్తం అవుతోంది.

రూ.150 కోట్లు కేటాయింపు...

మేడారం మహాజాతరకు ప్రభుత్వం రూ.150కోట్ల నిధులను విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మహాజాతరను నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీస్‌గడ్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రకృతి దైవాలైన సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు రానున్నారు. 2026 మహాజాతరకు సుమారు కోటిన్నర మందికి పైగా భక్తులు పాల్గొంటారనే అంచనాలతో శాశ్వత నిర్మాణాలతో పాటు రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, పారిశుద్యం, మరుగుదొడ్ల నిర్మాణం తదితర అభివృద్ధికి పనులకు ప్రభుత్వం నిధుల కేటాయింపులు చేసింది. వీటిలో మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీరాజ్‌శాఖకు (మిగతా 7లో...)

2026 మహా జాతరకు వివిధ శాఖలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలు..

శాఖ	కేటాయించిన నిధులు
పంచాయితీరాజ్	రూ.51.00 కోట్లు
ఆర్‌అండ్‌బీ	రూ.9.95 కోట్లు
ఇరిగేషన్/సీఏడీడీ	రూ.5.90 కోట్లు
ట్రైబల్ వెల్ఫేర్(ఇంజనీరింగ్)	రూ.8.75 కోట్లు
ఆర్‌డబ్ల్యుఎస్(సానిటేషన్)	రూ. 15.15 కోట్లు
మొత్తం	రూ. 90.87 కోట్లు

నాన్ సివిల్ వర్క్ శాఖలు

శాఖ	కేటాయించిన నిధులు		
జిల్లా పంచాయితీశాఖ	రూ. 11.62 కోట్లు	అటవీశాఖ	రూ. 50 లక్షలు
అగ్నిమాపకశాఖ	రూ.0.30 కోట్లు	మహిళా, శిశు, దివ్యాంగుల శాఖ	రూ.25 లక్షలు
మత్స్యశాఖ	రూ.0.23 కోట్లు	రెవెన్యూశాఖ	రూ.14.38 కోట్లు
పశుసంవర్ధకశాఖ	రూ.0.30 కోట్లు	దేవాదాయశాఖ	రూ.1.75 కోట్లు
ట్రైబల్ వెల్ఫేర్ (ఐటీడీఏ)	రూ.2.50 కోట్లు	ఎక్సైజ్‌శాఖ	రూ.25.00 లక్షలు
పౌర సంబంధాల శాఖ	రూ.57.85 లక్షలు	టూరిజంశాఖ	రూ.90 లక్షలు
వైద్య, ఆరోగ్యశాఖ	రూ.1.07 కోట్లు	విద్యుత్‌శాఖ	రూ.5.00 కోట్లు
పోలీసుశాఖ	రూ. 14.50 కోట్లు	రోడ్డు రవాణాశాఖ (ఆర్టీసీ)	రూ.5.00 కోట్లు
		మొత్తం:	రూ.59.13 కోట్లు

అయ్యో.. బిడ్డలారా!

ప్రమాద స్థలంలో నుజ్జు నుజ్జైన బొలేరో కారు



- రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రుల దుర్మరణం
- కారులో కలిసి ప్రయాణిస్తుండగా ఘటన
- స్వల్ప గాయాలతో బయటపడిన ఇద్దరు పిల్లలు
- కల్వర్టును బలంగా ఢీకొట్టిన కారు
- వడ్డిచర్ల వద్ద ప్రమాదం.. మృతులు ఏపీలోని నెల్లూరు జిల్లావాసులు
- నిద్రలేమితో డ్రైవింగ్ చేయడమే కారణమని అనుమానాలు





మృతిచెందిన సురేశ్, దివ్య

(వివరాలు:7లో)

యూరియా కోసం రైతుల పాట్లు



స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. విస్తారంగా వర్షాలు కురవడంతోపాటు, వరినాట్లు యూరియా వేసే దశకు చేరుకోవడంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు బుధవారం యూరియా కోసం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రానికి వచ్చి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చింది. యూరియా తీసుకోవడానికి గాను రైతుల వేలిముద్ర, ఓటీపీ, ఆధార్‌కార్డు అనుసంధానం చేయాల్సి ఉండంతో సర్వర్ సమస్యలు ఏర్పడుతున్నాయి. పలువురు రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం సరిపడా యూరియాను రైతులకు అందించాలన్నారు. ప్రభుత్వం యూరియా కొరత రాకుండా నిత్యం రైతులకు అందుబాటులో ఉండే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. యూరియా కొరత అనేది లేకుండా చూడాలని, అవసరాన్ని బట్టి పంటలకు యూరియా చల్లకపోతే దిగుబడి పైన ప్రభావం ఉంటుందని అధికారులు స్పందించి యూరియాను ఎక్కువ మొత్తంలో దిగుమతి చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

పీఏసీఎస్ కేంద్రానికి ఆదివారం వచ్చిన లారీ యూ రియా బుధవారం మధ్యాహ్నం వరకు అయి పోయింది. దీంతో వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులు వెను తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు ఎవరూ ఇబ్బందులు పడొద్దని గురువారం ఉదయం లారీ యూరియా వస్తుందని, రైతులు తీసుకోవచ్చని, రైతులు ఆందోళ చెందవద్దని పీఏసీఎస్ సీఈవో మగ్దుం అలీ పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు జీడి దేవదాసు, సట్ల నరేష్, కొంకటి సోమయ్య, కత్తుల కొ మురయ్య, సారయ్య, లావుడ్య జేత్రి తదితరులు పాల్గొన్నారు.

చెరువులు నింపాలని రోడ్డెక్కిన రైతులు

- కాళ్లు మొక్కుతా అన్నా కనికరించని ఈఈ
- ఈఈని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసిన అన్నదాతలు



ఇరిగేషన్ కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

జనగామ రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జనగామ మండలంలోని చెరువులు, కుంటలను నింపాలని రైతులు జన్నెపల్లి జనార్దన్, వల్లాల మల్లేశ్, దూసరి ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓబుల్ కేశవపూర్, పసరమడ్ల, సిద్దెంకి, పెద్దరాంచర్ల, శామీర్‌పేట గ్రామ రైతులు బుధవారం జిల్లా కేంద్రంలోని వడ్లకొండ రోడ్డులోని ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. రైతుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఈఈ మంగీలాల్‌ను సస్పెండ్ చేయాలని (మిగతా 8లో..)

మద్యం టెండర్లకు వేళాయె..

- రెండేళ్ల కాలపరిమితితో కేటాయింపు
- రూ. దరఖాస్తు ఫీజు రూ. 3 లక్షలకు పెంపు
- ఫీజు పెంపుతో తగ్గనున్న దరఖాస్తులు
- నేడో రేపో షెడ్యూల్ విడుదల



జిల్లాలో వైన్‌షాపుల టెండర్లకు నోటిఫికేషన్ విడుదల

జనగామ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియకు వేళయింది. మద్యం వ్యాపారులు, ఔత్సాహికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మద్యం దుకాణాల కేటాయింపునకు ప్రభుత్వం గం ట మోగించింది. 2025-27 సంవత్సరానికి గానూ మద్యం షాపుల పాలసీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. 2023 ఇచ్చిన నోటిఫి కేషన్‌కు కొంత చేర్పులు, మార్పులు చేస్తూ కొత్త నోటిఫికేషన్‌ను ఇచ్చింది. టెండర్ల ప్రక్రియ, షాపుల కేటాయింపు ప్రక్రియ, రిజర్వేషన్ల ఖరారు, ఏ సామాజిక వర్గానికి ఎంత రిజర్వేషన్, జనాభా ప్రాతిపదికన షాపులు చెల్లించాల్సిన ఎక్సైజ్ ట్యాక్స్ తదితర అంశాలను నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పొందుపరిచింది.

ఒకటి, రెండు రోజుల్లో షెడ్యూల్

రెండేళ్ల కాలపరిమితితో కేటాయించనున్న మద్యం దుకాణాలకు సంబంధించి విధివిధానాలను నోటిఫికేషన్ రూపంలో ప్రభుత్వం విడుదల చేయగా, టెండర్ల దాఖలు ప్రక్రియ, షాపుల వారీగా రిజర్వేషన్ల ఖరారు, డ్రా తేదీ తదితర ప్రక్రియకు సంబంధించిన పూర్తి స్థాయి షెడ్యూల్‌ను ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం నడుస్తున్న మద్యం దుకాణాలకు సంబంధించి 2023 ఆగస్టు 1 నోటిఫి కేషన్ విడుదల కాగా ఆగస్టు 3న షాపుల వారీగా రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ జరిగింది. ఆ తర్వాత ఆగస్టు 4 నుంచి ఆగస్టు 20 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఆగస్టు 21న మద్యం దుకాణాలకు డ్రా తీశారు. కాగా.. రాబోవు 2025-2027 సంవత్సరానికి గానూ బుధవారం నోటిఫికేషన్ విడుదల కాగా నేడో, రేపో షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. షెడ్యూల్ విడుదల కాగానే మరుసటి రోజే షాపుల వారీగా రిజర్వేషన్లను ఖరారు చేసి తర్వాతి రోజు నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తు ల సమర్పణకు 2023లో 15 రోజులు సమయం ఇవ్వ గా ఈసారి కూడా అంతే సమయం ఇచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన సెప్టెంబరు మొదటి వారంలో డ్రా ప్రక్రియ కూడా పూర్తి చేసే అవకాశం కనిపిస్తోంది.

కేటాయింపుల్లో 30 శాతం రిజర్వేషన్లు

మద్యం దుకాణాల కేటాయింపునకు ప్రభుత్వం గతంలో అవలంబించినట్లుగానే ఈసారి కూడా రిజర్వేషన్‌ను వర్తింపచేయాలని (మిగతా 8లో..)

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


రవి(ఫైల్)

చిలుపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలకు తోడు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మండలంలోని చిన్నపెండ్యాలలో జరిగింది. బుధవారం ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోడపట్ల రవి (42) హమాలీ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్నేళ్లుగా అతడు తాగుడుకు బానిస కావడంతో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. మృతుని భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

పట్టుబడిన విటుడు, మహిళ

జనగామ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఓ వ్యభిచార గృహంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ ఘటనలో ఒక విటుడితో పాటు ఓ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జనగామ సీఐ దామోదర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగామలోని బతుకమ్మకుంటకు వెళ్లే దారిలో రాజు అనే వ్యక్తితో పాటు ఓ మహిళ హోటల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ హోటల్ వెనుక వైపు గదిలో వ్యభిచారం జరుగుతోందని పోలీసులకు సమాచారం అందింది. కాగా.. పోలీసుల దాడి చేసి ఒక విటుడు, ఓ మహిళ అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వెళ్లే సరికే హోటల్ నిర్వాహకుడు రాజు పారిపోయినట్లు సీఐ తెలిపారు. హోటల్ నిర్వాహకుడు రాజుతో పాటు విటుడిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ మహిళను సఖి కేంద్రానికి తరలించామన్నారు.

పోగొట్టుకున్న బంగారాన్ని అప్పగించిన పోలీసులు

కృష్ణకాలనీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని దీక్షకుంట గ్రామానికి చెందిన పక్కల రాజమ్మ అనే మహిళ బ్యాంకు పని నిమిత్తం బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చింది. ఆమె వెంట తీచ్చుకున్న పర్సును ఆటో దిగుతున్న క్రమంలో ఎక్కడో పోగొట్టుకుంది. ఆ పర్సులో సుమారు తులం బరువు ఉన్న బంగారు చైనుతో పాటు చెవి కమ్మలు ఉన్నాయి. బ్యాంకు వెళ్లి చూసుకోగా పర్సులేకపోవడంతో వెంటనే భూపాలపల్లి పోలీసులను ఆమె ఆశ్రయించింది. దీంతో వెంటనే సీఐ నరేష్‌కుమార్ సహకారంలో పోలీసు సిబ్బంది సీసీ కెమెరాలను పరిశీలించారు. అంబేడ్కర్ కూడలిలోనే ఆమె పర్సు పడిపోవడాన్ని గుర్తించారు. అప్పటికి ఇంకా ఎవరూ ఆ పర్సును గుర్తించకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితురాలికి గంట వ్యవధిలోనే ఎస్సై సాంబమూర్తి అందించారు. దీంతో బాధితురాలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

అర్ధరాత్రి విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం

మల్హర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలో బుధవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో శ్రీనాథ్ కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి పనులు ముగించుకొని నిద్రకు ఉపక్రమించగా అర్ధరాత్రి ఒక్కసారి పెద్ద శబ్దం రావడంతో లేచి బయటకు వచ్చాడు. అప్పటికే దుకాణంలోని వస్తువులు కాలుతూ మంటలు, పొగ వస్తుండటంతో ఇంటిల్లిపాదిని లేపాడు. వెంటనే అందరూ కలిసి మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం, రెండు టీవీలు, నాలుగు సెట్‌టాప్‌బాక్సులు, ఫ్యాన్లు, దుకాణంలోని కిరాణ సామాన్లు, బట్టలు కాలిపోయాయి. సుమారు రూ. 6 లక్షల నష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై-2 రాజన్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు.

శిథిలావస్థలో నిచ్చెనలు

● భగీరథ ట్యాంకులలో కానరాని క్లోరినేషన్ ● కలుషిత నీటితో రోగాల బారిన ప్రజలు ● పట్టించుకోని అధికారులు

తొర్రూరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు శుద్ధమైన నీటిని అందించాలనే లక్ష్యంతో లక్షల వ్యయంతో మిషన్‌భగీరథ ట్యాంకులు నిర్మాణం చేశారు. వాటికి ఏర్పాటు చేసిన ఇనుప నిచ్చెనలు పూర్తిగా తుప్పుపట్టిపోయి కొన్ని చోట్ల విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో ట్యాంకును శుభ్రం చేయకపోవడంతో లోపల చెత్తాచెదారం, మట్టి పేరుకుపోయి పాకురుతో నీటి సరఫరా చేస్తున్నారు. కలుషితమైన నీరు దుర్వాసన రావడంతో నీటిని వినియోగిస్తున్న ప్రజలు జలుబు, జ్వరం, చర్మవ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. తొర్రూరు మండలంలో 94 వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అందులో పోలేపల్లి, గుడిబండతండా, కంఠాయపాలెం, వెంకటాపూరం, జమస్థాన్‌పురం, నాంచారిమదూరు, గుర్తూర్, పత్తేపురం గ్రామాల్లోని మంచినీటి ట్యాంకుల నిచ్చెనలు పాడైనప్పటికీ సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవటంలేదని ఆయా గ్రామల ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో తాము నిధుల కొరతతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఇక శిథిలమైన ట్యాంకుల నిచ్చెనలకు ఎలా మరమ్మతులు చేయించాలని, మరో వైపున కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కాల సీజన్‌లో రక్షిత మంచినీటి పథకాల ద్వారా అపరిశుభ్రమైన మంచినీటిని అందించటంతో నీరుతాగి దురద, జలుబు, దగ్గు, అంటు వ్యాధుల బారినపడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో మంచినీటి పథకాల నిచ్చెనలు విరిగి శిథిలమైనప్పటికీ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు వాటి మరమ్మతుల విషయమై ఏమాత్రం పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆయా పథకాల ద్వారా గ్రామాల్లో మంచినీటి అందిస్తున్నప్పటికీ ప్రజలు ఆ నీటిని తాగలేక పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


గుడిబండతండా మిషన్‌భగీరథ ట్యాంకు వద్ద తుప్పుపట్టిన నిచ్చెన


పోలేపల్లిలో ట్యాంకుపై నిలిచిననీరు, పేరుకుపోయిన పాకురు

నెలలో మూడు రోజులు శుభ్రం చేయిస్తున్నాం



గ్రామాల్లో తాగునీటి సరఫరా అవుతున్న మి షన్‌భగీరథ ట్యాంకులను ప్రతి నెలా మూడు రోజులు శుభ్రం చేయిస్తున్నాం. కొన్ని చోట్ల ట్యాంకుల మొట్లు ధ్వంసం కావడంతో చేయలేకపోతున్నాం. వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరికీ శుద్ధమైన జలాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, ఎంపీడీవో, తొర్రూరు

శిథిలమైన వాటికి ప్రతిపాదనలు పంపించాం

మండలంలో 94 ట్యాంకులను గ్రామ పంచాయతీలకు అప్పగించాం. వాటి నిర్వహణ పంచాయతీలదే. అయితే శిథిలమైన 15ట్యాంకులకు ప్రతిపాధనలు పంపించాం.

- మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, తొర్రూరు

రైతులు ఇబ్బందులు పడొద్దు

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వ్యవసాయ శాఖ, సహకార సంఘాల సీఈవోలు, మార్క్ ఫెడ్ అధికారులతో ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటలకు సరిపడా యూరియా రైతులకు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రైతులు పంటలు ఒకేసారి సాగు చేయడం వల్ల యూరియా వినియోగం పెరిగిందన్నారు. యూరియా ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి తరలించి రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు ముందస్తుగా యూరియా కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవద్దని, ప్రస్తుత అవసరాలకు మాత్రమే కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. జిల్లా నుంచి యూరియా బయటకు వెళ్లకుండా పటిష్టంగా పర్యవేక్షించాలన్నారు. వ్యవసాయ సంబంధిత యూరియాను పరిశ్రమలకు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. జిల్లాలో యూరియా, ఎరువుల లభ్యత, సరఫరాపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఏవో బాబురావు, డీపీవో వాల్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరఘాట్‌ను పరిశీలించిన కలెక్టర్

మహదేవపూర్: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం గోదావరి ఘాట్ వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం పరిశీలించారు. పనులు ఇంకా పెండింగ్ ఉండటంపై దేవాదాయ, ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో ఎందుకు జాప్యమవుతోందని దేవాదాయ శాఖ ఏఈ అశోక్‌ను ప్రశ్నించారు. సరస్వతీ పుష్కరాల సమయం నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోందని, ఇప్పటి వరకు కూడా ఎందుకు పూర్తి చేయలేక పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

ఉపాధ్యాయుల మహాధర్నాను విజయవంతం చేయాలి

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు సేవానాయక్ కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా పిలుపునిచ్చిన కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సీపీఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం పున రుద్ధరించాలని, పీఆర్‌సీని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు అశోక్, జగపతిరావు, తిరుపతి, ప్రభాకర్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురు స్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తుండడం తో జిల్లాలోని రామన్నగూడెం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశామని, అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్.దివాకర బుధ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వెంకటాపురం మండలంలో ఐదు కుటుంబాలు, వాజేడు మండలంలి 15, కన్నాయిగూడెం మండలంలోని 33, గోవిందరావుపేట మండలంలోని రెండు, ఏటూరునాగారం మండలంలోని 50కుటుంబాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సౌకర్యాలు కల్పించామని అన్నారు. జిల్లాలో 8పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా 75కుటుంబాలకు చెందిన 216 మందిని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలించడం జరిగిందని అన్నారు.

జిల్లాలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఇప్పటికే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాల ను సిద్ధంగా ఉంచామని, వారితోపాటు జిల్లా పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు నదీతీర ప్రాంతాలకు వెళ్లవద్దని, వరద నీటిలో వాహన ప్రయాణం చేయవద్దని, పిల్లలు, వృద్ధులను జాగ్రత్తగా ఉంచాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1800-4257109కు సమాచారం అం దించాలన్నారు. జిల్లా ప్రజల ప్రాణరక్షణలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య, తదితరశాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. గ్రామస్థాయినుంచి జిల్లాస్థాయి వరకు యంత్రాంగం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు.

యూరియా కోసం రైతుల ధర్నా

● కాళ్లు పట్టుకున్నా కనికరించని సిబ్బంది

● పీఏసీఎస్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో గణేష్

తొర్రూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు గత కొన్ని రోజులుగా పీఏసీఎస్ కేంద్రాల ముందు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్న నేపథ్యంలో బుధవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పీఏసీఎస్ కార్యాలయానికి యూరియా దిగుమతి అయిందన్న సమాచారంతో ఉదయం నుంచే రైతులు కార్యాలయం వద్దకు భారీగా చేరుకున్నారు. సొసైటీ సిబ్బంది రైతుల వద్ద ఆధార్, పట్టాదార్ పాసు పుస్తకం తీసుకుని ఒక బస్తా యూరియా ఇవ్వడంతో సోమారంకుంట తండాకు చెందిన గిరిజన రైతు బానోత్ వీరన్న తనకు రెండు బస్తాలు ఇవ్వాలని సిబ్బంది కాళ్లు మొక్కిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. సంఘటన స్థలానికి బీఆర్ఎస్ నాయకులు చేరుకుని రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలన్నారు.

ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలానికి తక్కువ యూరియా కేటాయింపు జరిగిందని, రైతుల సమస్యలు పట్టించుకోవడంలేదని. పరిస్థితిని తెలుసుకున్న ఆర్డీవో గణేష్ కార్యాలయానికి వచ్చి ఇప్పటి వరకు అందిన యూరియా సరఫరా, విక్రయాలు, తదితర అంశాలను సొసైటీ సిబ్బంది వద్ద వివరాలు తీసుకుని రైతులతో మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ యూరియా అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం రెండు, మూడు రోజుల్లో సరిపడా యూరియా అందిస్తుందని, ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. ఏవో రాంనర్సయ్యను వివరణ కోరగా ఇప్పటివరకు మండలానికి 1600 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని, రైతుల అవసరం మేరకు ఖరీఫ్‌కు సరిపోను యూరియా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉన్నారు.


అధికారి కాళ్లు మొక్కుతున్న రైతు

రహదారిపై రైతుల రాస్తారోకో

దంతాలపల్లి: యూరియా కోసం మహబూబాబాద్ జిల్లా దంతాల పల్లిలో ఖమ్మం- వరంగల్ జాతీయ రహదారిపై రైతులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అరగంట పాటు రాస్తారోకో చేపట్టడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై రాజు ఆందోళన చేస్తున్న రైతులకు వద్దకు వచ్చి మాట్లాడి ఆందోళన విరమింప చేశారు. అనంతరం వాహనరాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో రైతులు, ఏఐకేఎంఎస్ నాయకులు భిక్షపతి, వెంకన్న, శ్రీను, వెంకట్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా పలిమెల మండల శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. పోలీసులను చూపి పారిపోతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మరో ముగ్గురు పారిపోగా వారి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. అదే విధంగా మహదేవపూర్ మండలంలోని బొమ్మాపూర్ శివారు ప్రాంతంలోని పేకాట స్థావరాలపై దాడులు చేసినట్లు సమాచారం. పలువురు రాజకీయ నాయకుల అండదండలతోనే పేకాటరాయుళ్లు పోలీసులకు చిక్కకుండా బయటపడినట్లు తెలిసింది.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

యువతలో నైపుణ్యాలు పెంచేందుకు కృషి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు భూపాలపల్లి ఐటీఐలో ఏటీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం ఆయన ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామీణ స్థాయి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు రెండేళ్ల కాల పరిమితితో ఈ కోర్సులు పూర్తి చేసేందుకు అవకాశం ఉందన్నారు. ప్రధానంగా బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైర్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ కోర్సుల్లో 172 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీఎంకు నిర్వాసితుల పోస్టుకార్డులు

మల్హర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జెన్‌కో భూ ఉపరితల బొగ్గు గనుల్లోని తాడిచర్ల డేంజర్ జోన్ భూ నిర్వాసితులు సీఎం రేవంత్‌రెడ్డికి తమ సమస్యలు వివరించారు. ఈ మేరక మూకుమ్మడిగా బుధవారం పోస్టుకార్డులు పంపారు. తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్కో భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి ఈ మేరకు తెలిపారు. సీఎం క్యాంపు ఆఫీసుకు రెండు వేల కార్డులను పోస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నిర్వాసితులను డేంజర్ జోన్ నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని సీఎంను కోరామని అన్నారు. ఎనిమిదేళ్లుగా ఓసీపీలో బ్లాస్టింగ్ వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో భూ నిర్వాసితులకు ఇచ్చిన హామీని మంత్రి శ్రీధర్‌బాబు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇందారపు సరీన్, సమ్మయ్య, మంతెన సమ్మయ్య, సారయ్య, ప్రవీణ్, ప్రమీల, తుంగపల్లి లక్ష్మీ, స్వరూప, బండెల శ్రీను, సాగర్ పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7675	5300
మక్కలు	2216	1521
కందులు	5852	3022
పెసళ్లు	7022	3022
పల్లికాయ (సూక)	6920	3450
పల్లికాయ (పచ్చిది)	5050	1575
పసుపు (కాడి)	11022	9534
పసుపు (గోల)	10099	8700
తేజ మిర్చి	10000	8500
తేజ ఏసీ	14200	11500
వండర్‌హాట్	11500	6000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్341ఏసీ	14500	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

పలువురికి ఓయూ డాక్టరేట్ల ప్రదానం

చిన్నగూడూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా గీసుకొండ ప్రభుత్వ మోడల్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న దుండి అశోక్ ఉస్మానియా విశ్వ విద్యాలయం 84వ స్నాతకోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో డాక్టరేట్ అందుకున్నారు. ముఖ్య అతిథులు తెలంగాణ గవర్నర్, చాన్సలర్ జిష్ణుదేవ్‌శర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణ చేతుల మీదుగా అశోక్ ఈ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆన్ టీచబులిటీ ఇన్ మైథలాజికల్ సర్స్పెక్టివ్స్, హెటిరోగ్లాసియా ఇన్ ట్రాన్సలేషన్, ఇతర పరిశోధన పత్రాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రచురించడంతో పాటు అశోక్ ఎన్నో స్వీయ రచనలు చేశారు. దుండి అశోక్ మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం పగిడిపల్లి వాసి. చిన్నప్పటి నుంచి ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటూ అశోక్ కళాశాల అధ్యాపకుడిగా రాణిస్తున్నారు.

జాటోత్ నరేందర్‌కు..

మరిపెడ (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మునిసిపల్ పరిధి కొత్తతండాకు చెందిన నిరుపేద విద్యార్థి జాటోత్ నరేందర్ గవర్నర్ బిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా ఓయూ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ ఏడాది పీహెచ్‌డీ (ఈఈఈ) ఉస్మానియా యూనివర్సిటీలో చేస్తూ 'సాఫ్ట్‌స్విచ్డ్ లెడ్ డ్రైవర్ సర్క్యూట్ కండీషనర్ ఫర్ లెడ్ లైటింగ్ అప్లికేషన్స్‌పై' వివిధ పరిశోధనలు జరిపి డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఓయూ స్నాతకోత్సవంలో భాగంగా ఈ అవార్డును అక్కడి నిర్వాహకులు నరేందర్‌కు అందజేశారు.

బానోత్ స్రవంతికి..

కురవి (ఆంధ్రజ్యోతి) : సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యానాయక్‌తండాకు బానోత్ స్రవంతి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. బీల్యానాయక్ తండాకు చెందిన బానోత్ బాలునాయక్-అరుణాబాయ్ దంపతుల కుమార్తె స్రవంతి బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఫైనాన్స్)లో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. వరంగల్ నిట్ ఇంజనీరింగ్ కళాశాలలో బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఫైనాన్స్)లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన స్రవంతి ఇంపాక్ట్ ఆఫ్ కోవిడ్-19 ఆన్ కో-ఆపరేటివ్ బ్యాంకింగ్ ఈన్ ఇండియా అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.


డాక్టరేట్ అందుకుంటున్న అశోక్

ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు కృషి

- ములుగు మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్
- కేయూలో రెండో రోజు సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీలు
- అబ్బుర పరిచిన చిన్నారుల సైన్స్ ఎగ్జిబిట్లు
- నేటితో ముగియనున్న సైన్స్ కాంగ్రెస్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రశేఖర్

కేయూ క్యాంపస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక వ్యాధులు లేని విధంగా ప్రజలు ఆరోగ్యమైన జీవన ప్రమాణాల పెంపుకోసం కృషి జరుగుతోందని ములుగు మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అన్నారు. కేయూలో జరుగుతున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీలు, సదస్సులు, టెక్నికల్ సెషన్లు, విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్లు బుధవారం రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కేయూ ఫార్మసీ కళాశాలలో జరిగిన సెషన్‌లో 'జీవన ప్రమాణాలు-లైఫ్ ఎక్స్‌టెన్సీ' అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు. 1950లో వ్యక్తుల సగటు వయస్సు 46 ఏళ్లుగా ఉండేదని, తర్వాత 70ఏళ్లకు పెరిగిందన్నారు. సైన్స్, టెక్నాలజీలో రూపొందించిన ఔషధాలతో అంటువ్యాధుల నిర్మూలన సాధ్యం అయిందన్నారు. షుగర్, రక్తపోటు, గుండె జబ్బులులతో పాటు క్యాన్సర్లు ఎక్కువగా విస్తరిస్తున్నాయని అన్నారు. తద్వారా పెరిగిన ఆయుర్దాయంలో నాణ్యత లోపించిందన్నారు. సగటు మనిషి జబ్బులతో సమాజానికి ఆర్థిక భారాన్ని పెంచుతున్నారని విశ్లేషించారు. దీర్ఘకాలిక వ్యాధుల్లేని జీవనం కావాలని చెప్పారు. ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంచుకోవాలని సూచించారు. హైదరాబాద్ బిట్స్‌పిలానీ బయోలాజికల్ సైన్స్ ప్రొఫెసర్ నిశీత్‌గుప్తా బయోలాజికల్ సైన్స్ ప్రా ముఖ్యతను వివరించారు. సెషన్‌కు చైర్మన్‌గా ప్రొఫెసర్ జానపురెడ్డి కృష్ణవేణి వ్యవహరించగా, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ వైనర్సింహారెడ్డి, ప్రొఫెసర్ సిద్ది వీరేశం, శాస్త్రవేత్తలు, ఫార్మసిస్టులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నియంత్రణ ఆవశ్యకతపై బొల్లికుంట పాఠశాల విద్యార్థులు రూపొందించి నమూనాను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ స్వర్ణలత

క్యాన్సర్ ట్యూమర్లను ముందే గుర్తించవచ్చు..

చిన్న ఎక్స్‌ట్రా సెల్యూలర్ వెసికుల్స్ ట్యూమర్ కణాల సమాచారాన్ని ముందే గుర్తించి క్యాన్సర్‌ను అరికట్టవచ్చునని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల హైదరాబాద్ ప్రొఫెసర్ గీతా కె.వేముగంటి చెప్పారు. కేయూ సెనెట్ హాల్‌లో మహిళా శాస్త్రవేత్తల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గీతా కె.వేముగంటి కీలక ప్రసంగం చేశారు. చిన్న ఎక్స్‌ట్రా సెల్యూలర్ వెసికుల్స్ ట్యూమర్ కణాల మధ్య సమాచార మార్పిడిలో కీలకంగా వ్యవహరిస్తాయని చెప్పారు. వెసికుల్స్ ఇమ్యూన్ సిస్టమ్‌ను తప్పించుకునేవిధంగా పనిచేసి క్యాన్సర్‌సెల్స్‌రక్షణపొందేలా చేస్తాయని తెలిపారు.

హైదరాబాద్ ఐఐటీసీ ప్రొఫెసర్ సుంకర వర్ధినేని మనోరమ ప్రసంగిస్తూ.. వ్యక్తి, సమాజం తాత్కాలికంగా ప్రారంభించిన జీవన ప్రయాణ క్రమం వారి జీవన విధానంగా రూపొందుతుందని అన్నారు. ప్రతీ ప్రయాణం అభివృద్ధి, సేవ, సాంస్కృతిక మార్పు వైపునకు దారితీస్తోందని అన్నారు. హైదరాబాద్ డీఆర్‌డీవో శాస్త్రవేత్త టి.వెంకటమణి వ్యవస్థలో వస్తున్న ఆధునిక పోకడలపై మాట్లాడారు. యంగ్ సైంటిస్టుల మీట్‌లో హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ సైంటిస్టు ప్రొఫెసర్ రామచంద్రరావు మాట్లాడుతూ.. క్వాంటం,డాట్స్‌పై సౌర పటాలాలు, వైద్య రంగంలో క్వాంటం, కంప్యూటింగ్‌పై విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. హైదరాబాద్ ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్త హర్షిత్‌రెడ్డి గంగుల అరుదైన భూ మూలకాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వరంగల్ కేఎంసీ సైంటిస్టు డాక్టర్ బి.ఫణికాంత్ జోగం మాట్లాడుతూ.. ప్రొటీన్ల మార్పిడి పై విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఫిజిక్స్ విభాగంలో హైదరాబాద్ హెచ్‌సీయూ ప్రొఫెసర్ ఎస్.శ్రీనాథ్ అయస్కాంత పదార్థాలు రోజువారి వినియో గం, ఉపయోగాలపై మాట్లాడారు.

అబ్బురపరిచిన చిన్నారుల సైన్స్ ఎగ్జిబిట్లు

యూనివర్సిటీ ఆడిటోరియం వద్ద చిన్నారుల సైన్స్ ఎగ్జిబిట్లతో మినీ ప్రపంచం కన్పిస్తోంది. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సును పురస్కరించుకుని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హైస్కూల్ విద్యార్థులు అబ్బుర పరిచే సైన్స్ ఎగ్జిబిట్లను రూపొందించి ప్రదర్శించి తమ ప్రతిభను చూపారు. మాదక ద్రవ్యాలతో మానవ శరీరంలో సంభవించే దుష్ప్రభావాలను వివరించారు. విద్యుత్ అవసరం లేకుండా చార్జింగ్ ప్రక్రియ, సోలార్ శక్తితో నడిచే యంత్రాలను తయారుచేసి ఔరా అనిపించారు. ట్రాఫిక్ నియంత్రణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విచ్చలవిడి డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలను చూపించారు. చంద్రయాన్-3, నమూనా, మరయంత్రం, స్మార్ట్ సిటీ, వాతావరణ కాలుష్యంతో పర్యావరణ ప్రభావం, సంప్రదాయ, సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగాన్ని నమూనారూపంలో అబ్బురపరిచే విధంగా చూపించారు. బొల్లికుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు నగరంలోని పలు ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.


సైన్స్ ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ జ్యోతి, ఇస్తారి, మమత, ఇతర అధ్యాపకులు



నేడు ముగింపు సమావేశం

కాకతీయ యూనివర్సిటీలో రెండురోజులుగా జరుగుతున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీలు, ఎగ్జిబిషన్లు, సదస్సులు గురువారంతో ముగియనున్నాయి. ముగింపు సమావేశం కేయూ ఆడిటోరియంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుంది. దీనికి విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితారాణా, కడప యోగి వేమన మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎ.రామచంద్రారెడ్డి, తెలంగాణ సైన్స్ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ సీహెచ్.మోహన్‌రావు, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, రాష్ట్ర కాలేజీయేట్ కమిషనర్ ఎ.శ్రీదేవసేన, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ప్రొఫెసర్ సీహెచ్.సంజీవరెడ్డి, ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ జి.హన్మంతు, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ మంచాల సదానందం, ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, ప్రొఫెసర్ ఎస్ఎం రెడ్డిలు పాల్గొంటారని తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ బైరు వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు.

సైన్స్ కాంగ్రెస్‌లో ఉత్సాహంగా ప్రజంటేషన్లు

- హాజరైన దేశ, విదేశాల శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో రెండో రోజు బుధవారం కామర్స్, ఫిజిక్స్, మ్యాథ్స్, ఫార్మసీ, జువాలజీ విభాగాల సెమినార్ హాల్‌తోపాటు ఆడిటోరియంలో జరిగిన ప్లీనరీలు, లెక్చర్లు, ప్రజంటేషన్లపై వివరాలను తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ 2025 ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి వెల్లడించారు. కామర్స్ విభాగంలో ఇన్‌వైటెడ్ లెక్చర్, 5, ఓరల్ ప్రజంటేషన్లు 8, సెనెట్ హాల్‌లో ఇన్‌వైటెడ్ లెక్చర్, ఉమెన్ సైంటిస్టు మీట్‌లు 3, కేయూ ఆడిటోరియంలో థీమటిక్ సెషన్లు, సైన్స్ ఎగ్జిబిషన్, ఫిజిక్స్ విభాగంలో ఇన్‌వైటెడ్ లెక్చరు 4, ఓరల్ ప్రజంటేషన్లు 11, పోస్టర్ ప్రజంటేషన్లు 7, గణిత విభాగంలో ఇన్‌వైటెడ్ లెక్చర్ 3, ఓరల్ ప్రజంటేషన్లు 10, పోస్టర్ ప్రజంటేషన్లు 6, కెమిస్ట్రీ విభాగంలో ఇన్‌వైటెడ్ లెక్చర్ 2, ఓరల్ ప్రజంటేషన్లు 10, పోస్టర్ ప్రజంటేషన్లు 8, ఫార్మసీ విభాగంలో ఇన్‌వైటెడ్ లెక్చర్ 23, ఓరల్ ప్రజంటేషన్లు 4, పోస్టర్ ప్రజంటేషన్లు 4, ఫార్మసీ విభాగంలోని మినీ సెమినార్ హాల్‌లో ఇన్‌వైటెడ్ లెక్చర్ 2, ఓరల్ ప్రజంటేషన్లు 4, పోస్టర్ ప్రజంటేషన్లు 5, జువాలజీ విభాగంలో ఇన్‌వైటెడ్ లెక్చర్ 2, ఓరల్ ప్రజంటేషన్లు 8, పోస్టర్ ప్రజంటేషన్లు 10 జరిగినట్లు వెంకట్రామిరెడ్డి వెల్లడించారు. మొత్తంగా ఇన్‌వైటెడ్ లెక్చర్ 23, ఓరల్ ప్రజంటేషన్లు 58, పోస్టర్ ప్రజంటేషన్లు 40లు జరిగాయి.

హోరెత్తించిన నృత్యాలు

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాల్లో భాగంగా బుధవారం రాత్రి కేయూ ఆడిటోరియంలో సాంస్కృతిక సంబురాలు జరిగాయి. కళాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా నృత్యాలు చేసి హోరెత్తించారు. నర్సంపేటకు చెందిన చోటు డప్పు కళాబృందం, వాగ్దేవి ఫిజియోథెరపీ కళాశాల విద్యార్థిని ఎం.సాయి తులసీ స్వాగత నృత్యం, ఆదిలాబాద్ జిల్లా కల్చర్ మధూరి నృత్యం, అల్లం జంపయ్య గ్రూప్ నృత్యం, రవితేజ గ్రూప్ ఫోక్ సాంగ్, నర్సంపేటకు చెందిన లలిత బృందం బంజార నృత్యం, నాగార్జున గ్రూప్ ఫోక్ డ్యాన్స్, డప్పు డ్యాన్స్, ధింసా నృత్యం, వాగ్దేవి కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం బతుకమ్మ నృత్యం, అల్లం జంపయ్య బోనాల నృత్యాలు ఆలకరించాయి.


వ్యవసాయ రంగం సాంకేతికతపై కీలక ప్రసంగం చేస్తున్న ప్రొఫెసర్ దువ్వా

అయ్యో.. బిడ్డలారా!

- రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రుల దుర్మరణం
- కారులో కలిసి ప్రయాణిస్తుండగా ఘటన
- స్వల్ప గాయాలతో బయటపడిన ఇద్దరు పిల్లలు



స్వల్ప గాయాలతో బయటపడ్డ కుమారుడు మోక్షజ్ఞ్, కుమార్తె లోక్షణ

లింగాలఘణపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కళ్లెదుటే జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అమ్మానాన్నలను కోల్పోయి ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారిపోయారు. అప్పటిదాకా అమ్మ చెబుతున్న కబుర్లను శ్రద్ధగా వింటున్న ఇద్దరు పిల్లలు.. చూస్తుండగానే వాయువేగంతో నాన్న డ్రైవింగ్ చేస్తున్న కారు రెప్పపాటులో కల్వర్టును ఢీకొట్టింది. కళ్లు మూసి తెరిచేలోపే రక్తపు మడుగులో ఆర్తనాదాలు చేస్తున్న అమ్మానాన్నలు.. చుట్టూ పొగ మంచులా కమ్మేసిన కారు బెలూన్లు.. ఏం జరిగిందో అర్థంకాని పరిస్థితుల్లో ఇద్దరు చిన్నారులు క్షణాల్లో అనాథలుగా మారిపోయారు. జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై బుధవారం లింగాలఘణపురం మండలం వడ్డిచర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దద్దోలు సురేశ్(36), అతని భార్య దద్దోలు దివ్య(30) దుర్మరణం పాలయ్యారు.

లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన సురేశ్ కరీంనగర్‌లో ఓ గ్రానైట్ కంపెనీలో గ్రానైట్ మార్కర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవలే సమీప బంధువుల వివాహ వేడుకల కోసం స్వస్థలానికి వెళ్లి తిరిగి కరీంనగర్‌కు బుధవారం తెల్లవారుజామున్నే భార్య దివ్య, పిల్లలు మోక్షజ్ఞ్, లోక్షణతో కలిసి సొంత కారులో బయలుదేరారు. సురేశ్ స్వయంగా డ్రైవింగ్ చేస్తున్నాడు. మార్గమధ్యలో భోజనం ముగించుకుని మళ్లీ ప్రయాణాన్ని ప్రారంభించారు.

ఈ క్రమంలో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో వడ్డిచర్ల వద్దకు రాగానే తీవ్రవేగంతో వస్తున్న కారు అదుపుతప్పి ఎదురుగా ఉన్న కల్వర్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరో కారు నుజ్జునుజ్జు కాగా, అందులోనే ఇద్దరు పిల్లలతో సహా సురేశ్, అతడి భార్య ఇరుక్కు పోయారు. వెంటనే గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై శ్రవణ్‌కుమార్ స్థానికుల సహాయంతో క్షతగాత్రులను బయటకు తీసి 108ద్వారా జనగామ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా, మార్గమధ్యలో సురేశ్ మృతి చెందగా, ఆసుపత్రికి చేరుకున్న కొద్దిసేపట్లోనే దివ్య మరణించింది. స్వల్పగాయాలతో ఇద్దరు పిల్లలు ప్రాణాలతో బయటపడ్డారు. అయితే ప్రమాదానికి సురేశ్ నిద్రమత్తు కారణంగా స్థానికులు, పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, కారులో కుడివైపున డ్రైవింగ్ సీటులో కూర్చున్న సురేశ్, అతడి వెనుక సీటులో కూర్చున్న దివ్య తీవ్ర గాయాలకు గురై ప్రాణాలు విడవగా, ఎడమ వైపు కూర్చున్న ఇద్దరు పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడటం మిరాకిల్‌గా భావిస్తున్నారు.

అమ్మానాన్నకేం కాలేదుగా..

ప్రమాదంలో తీవ్రంగాగాయపడ్డ సురేశ్, దివ్య మృతి చెందారనే విషయం పిల్లలు మోక్షజ్ఞ్, లోక్షణకు చాలా సేపటిదాకా తెలియకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా ఇద్దరు పిల్లలను ఎస్సై శ్రవణ్‌కుమార్ తనవాహనంలో ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితేఅక్కడకు చేరుకున్న తర్వాత అమ్మానాన్నలు కనిపించకపోయేసరికి అమ్మ, నాన్న ఎక్కడున్నారని ఎస్సై శ్రవణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. పక్కనే డాక్టర్ ఇంజక్షన్ ఇస్తున్నారని బదులివ్వడంతో అమ్మానాన్నకు ఏం కాలేదుగా.. అని అమాయకంగా అడిగిన తీరు అక్కడున్న వారి హృదయాలను మెలిపెట్టింది. ఆత్మీయులు అందుబాటులో లేకపోవడం.. ఏం జరిగిందో పిల్లలకు తెలియకపోవడంతో ఓదార్చేందుకు ఎస్సై ఇడ్లీ తెప్పించి తినిపించారు.


కారులోనే ఇరుక్కుపోయిన సురేశ్

కారు తాకిడికి కదిలిన కల్వర్టు..

సాధారణంగా ప్రమాదం జరిగితే కేవలం వాహనం మాత్రమే ధ్వంసమవుతుంది. వాయువేగంతో వచ్చి బలంగా ఢీకొట్టడంతో ఏకంగా జాతీయ రహదారికి చెందిన కల్వర్టు పునాదితో సహా కదిలిపోవడం గమనార్హం. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని బెలూన్లు ఓపెన్ అయినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

వివాదాల సుడిలో వరంగల్ డీఈవో

- సర్కారుకు సరెండర్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఆందోళన
- విచారణ ప్రారంభించిన అదనపు కలెక్టర్
- బదిలీ వేటు తప్పదా...?

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి వివాదాల సుడిగుండంలో చిక్కుకున్నారు. ఎఫ్ఏసీ డీఈవోగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఆయన వ్యవహార శైలిపై ఉపాధ్యాయ సంఘాలతో పాటు విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి. ఇటీవల ఎంఈవోలతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఏఎంవోతో దురుసుగా ప్రవర్తించడమే కాక పరుష పదజాలంతో దూషించడంతో ఈ ఆందోళన ఉధృతంగా మారింది. డీఈవోపై పలు ఆరోపణలు చేస్తూ టీఎస్‌జీహెచ్‌ఎంఏ, టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్, టీపీయూఎస్, ఎస్టీయూ, ఎస్సీఎస్టీయూఎస్ తదితర ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు వివిధ విద్యార్థి సంఘాలు కూడా ఆందోళనలు చేస్తున్నాయి. జిల్లా కలెక్టర్ సత్యశారదతో పాటు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్. నాగరాజు, ఎంపీ కడియం కావ్య, తదితర ప్రజాప్రతినిధులతో పాటు ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డికి డీఈవోను సరెండర్ చేయాలంటూ ఫిర్యాదులు చేశారు. అలాగే వరంగల్ డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న కొంత మంది మహిళా అధికారులు సైతం డీఈవో వ్యవహారశైలిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఉపాధ్యాయ సంఘాల ఐక్య పోరాట కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వరంగల్ డీఈవో వ్యవహారశైలి, ఆరోపణలపై ఫిర్యాదు చేశారు.

కాగా, ఉపాధ్యాయ సంఘాల ఆందోళన, ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డీఈవోపై విచారణకు ఆదేశించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణిని విచారణ అధికారిగా నియమించారు. సోమవారం ఉపాధ్యాయ సంఘాలతో పాటు ఏఎంవో సుజన్ తేజను అదనపు కలెక్టర్ విచారణ చేసినట్లు తెలిసింది. అలాగే కార్యాలయ సిబ్బందిని పిలిపించి వారి ఫిర్యాదు వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. అలాగే ఎంఈవోలను కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి విచారణ జరిపినట్లు తెలిసింది. కార్యాలయ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదులపై సైతం ఆమె విచారణ చేయనున్నట్లు తెలిసింది.

బదిలీ వేటు తప్పదా...?

డీఈవో వైఖరి, వ్యవహారశైలిపట్ల గతంలో అనేక సార్లు అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్.. తమ ఫిర్యాదుపై స్పందించి డీఈవోపై వేటు వేస్తారని ఉపాధ్యాయ సంఘాల నేతలు ధీమావ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయంలోనూ డైరెక్టర్ నికోలస్ వరంగల్ డీఈవోపై వేటు వేసేందుకు రేపోమాపో చర్యలు తీసుంటారనే ఉపాధ్యాయ సంఘాల నేతల్లో ప్రచారం అవుతోంది. అయితే డీఈవో మంత్రి, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి తనపై చర్యలను నిలిపివేయాలని కోరినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

అక్రమాల డీఈవోను సాగనంపాలి..



డీఈవో ప్రతీ పనికి ఓ రేటును ఫిక్స్ చేసుకొని అక్రమాలకు పాల్పడుతున్నారు. డిప్యూటేషన్లు, పోస్టింగులు, పెన్షన్లు, ఎయిడెడ్ టీచర్ల బిల్లులు తదితర అంశాల్లో ప్రభుత్వ నిబంధనలను మారుస్తూ తనకు అనుకూలంగా మారుస్తూ లంచాలు తీసుకుంటున్నారు. ఆయన అక్రమాలకు సహకరించని ఉపాధ్యాయులను, ఆఫీస్ సిబ్బందిని దూషించడం, బెదిరించడమే కాకుండా మహిళా అధికారులని చూడకుండా దూషిస్తున్నారు. డీఈవోను వెంటనే విధుల నుంచి తొలగించాలి.

- ఎస్.రవీందర్, హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

అహంకారపూరిత డీఈవో మాకొద్దు..



ఉపాధ్యాయుల పట్ల, కార్యాలయ సిబ్బందిపట్ల అహంకార పూరిత ధోరణితో వ్యవహరిస్తూ, పరుష పదజాలంతో దూషిస్తున్న ఈ డీఈవో మాకొద్దు. డిక్టేటర్‌లాగా వ్యవహరిస్తున్న ఆయనపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం.

- సి.సుజన్‌ప్రసాద్‌రావు, టీఎస్‌యూటీఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉమ్మడి జిల్లాలో జడ్జిల నియామకం

వరంగల్ లీగల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, హనుమకొండ జిల్లాలకు కొత్తగా ఎంపికైన జడ్జిలను కేటాయిస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మేడ్చల్ మల్కాజిగిరికి చెందిన పి.గిరిధర్‌ను నర్సంపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మల్కాజిగిరికి చెందిన బొడ్డు శ్రీవల్లి శైలజను పరకాల ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన డి.మధులిక తేజ ములుగు అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా, సికింద్రాబాద్‌కు చెందిన రాజునిధిని వరంగల్ జిల్లా నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ ఎక్సైజ్ కోర్టు జడ్జిగా, హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన బనావత్ అనూషను హనుమకొండ జిల్లా రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ పీసీఆర్ కోర్టు న్యాయమూర్తిగా ఆదేశాలు జారీ చేసింది.

కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొనుగోలు, ఇతర సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సత్యశారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నెంబర్ 18004253424, ఫోన్ నంబర్లు 0870-2530812, 9154252936లకు కాల్ చేయాలని సూచించారు.

నిధుల వరద

(5వ పేజీ తరువాయి)

అత్యధికంగా రూ.51.30 కోట్ల నిధులు కేటాయించారు. ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.9.95 కోట్లు, నీటిపారుదల శాఖకు రూ.5.90 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖ(ఇంజనీరింగ్ విభాగం)కు రూ.8.57 కోట్లు, ఆర్‌డబ్ల్యుఎస్, పారిశుధ్యం కోసం రూ.15.15 కోట్ల నిధులు కేటాయించారు. వివిధ అభివృద్ధి పనులకే రూ.90.87 కోట్లు కేటాయించారు. అలాగే మిగతా 15శాఖలకు రూ.59.13కోట్లు కేటాయించారు. ఇందులో ప్రధానంగా జిల్లాపంచాయతీ అధికారికి రూ.11.62కోట్లు అత్యధికంగా కేటాయించగా, పోలీస్ శాఖకు రూ.14.50కోట్లు, రెవెన్యూ శాఖకు రూ.14.38 కోట్లు, దేవాదాయశాఖకు రూ.1.75కోట్లు కేటాయించారు.

కాగా, జాతరలో ఈసారి భక్తులు అసౌకర్యా లు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత జాతర కంటే మరింత విస్తృతంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. భారీగా సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేయనున్నారు. అత్యవసర వైద్య సేవ కేంద్రాలు, ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు, ఉచిత బస్సులు సంఖ్య పెంచటం, తాత్కాలిక వసతి గృహాలను ఏర్పాటు చేయటం వంటి అదనపు సౌకర్యాలు కల్పించేలా అధికారులు దృష్టి పెట్టారు. మొత్తంగా రికార్డు స్థాయిలో మేడారం జాతరకు ఈసారి రూ.150కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. తెలంగాణ ఏర్పడిన తరువాత తొలిసారిగా 2016లో జరిగిన మేడారం మహాజాతరకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.150.50కోట్లు కేటాయించింది.

మహాజాతరకు భారీ నజరానా

కాంగ్రెస్ ప్రభుత్వం మేడారం మహాజాతరపై ప్రత్యేక దృష్టి పెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డికి సమ్మక్క, సారలమ్మల సెంటిమెంట్ ఉండటంతో మహాజాతర అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. 2023 ఫిబ్రవరి 6వ తేదీన హత్ సే హత్ జోడో యాత్రను రేవంత్‌రెడ్డి మేడారం నుంచే ప్రారంభించి సక్సెస్ అయ్యారు. అదే సెంటిమెంట్‌తో తల్లుల జాతర అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

2024లో ఫిబ్రవరిలో జరిగిన మహాజాతరకు రెండు నెలల సమయమే ఉన్నప్పటికీ రూ.105 కోట్లు ఇవ్వగా, తాజాగా ఐదు నెలల ముందే మహాజాతర కోసం రూ.150 కోట్లు కేటాయించారు. ప్రధానంగా తెలంగాణ ఏర్పడిన తరువాత మేడారం జాతర అభివృద్ధికి పాలకులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. 2014, జూన్ 2న స్వరాష్ట్రం సిద్ధించినప్పటి, తొలి జాతరను మాత్రం 2016 ఫిబ్రవరిలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. 2016లో భారీస్థాయిలో మేడారం జాతరకు రూ.150.50 కోట్లు కేటాయించింది. స్వరాష్ట్రంలో భారీగా నిధులు కేటాయించి, గిరిజన జాతర వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయాలని సంకల్పించింది. దీంతో మేడారం భక్తుల్లో ఆనందం వ్యక్తమైంది. అయితే 2018 జాతర కోసం అధికారులు రూ.175 కోట్లతో మొదటి ప్రతిపాదనలు పం పించారు. కానీ, రూ.85.55 కోట్లు మాత్రమే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంకేటాయించింది. దీంతో రెండేళ్లకే మేడా రం జాతరకు రూ.69.95 కోట్ల కోత పడింది. ఆ తరువా త 2020లో జరిగిన మేడారం జాతర కోసం అధికారు లు రూ.128కోట్లతో ప్రతిపాదనలు పంపిస్తే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.75కోట్లు కేటాయించింది.

2022లో కూడా ప్రభుత్వం రూ.75కోట్లే కేటాయించింది. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం మేడారం జాతరపై చిన్నచూపు చూస్తోందనే విమర్శలు వినిపించాయి. 2014 జాతరకు ఎన్నికల కోడ్ పేరుతో గత ప్రభుత్వం నిధులు కేటాయింపులు చేయకుండా చేతులెత్తేసింది. సెప్టెంబరు, అక్టోబరు నెలలోనే మహాజాతరకు నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించలేదు. దీంతో 2023 డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం రావటంతో మేడారం జాతరకు రూ.105 కోట్లు కేటాయించింది. మహాజాతరకు కేవలం రెండు నెలల గడువే ఉన్నప్పటికీ యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మేడారం మహాజాతరకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఐదు నెలల ముందే మహాజాతరకు రూ.150 కోట్లు కేటాయించారు. నిధులు కేటాయింపులు ముందుగా జరగటంతో టెండర్ల ప్రక్రియ సాఫీగా జరగటంతో పాటు ఇతర పనులను నాణ్యతతో చేపట్టే అవకాశం ఉంటుంది.

అభివృద్ధికి మరింత ఊతం

మేడారం మహాజాతరకు ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేయటంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. గతం లో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహాజాతరకు ఇంత భారీ మొత్తంలో నిధులు కేటాయించారని పేర్కొన్నారు. మేడారం మహాజాతరలో భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించటంతో పాటు మరింత అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతోపాటు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లకు మంత్రి సీతక్క ఓ ప్రకటనలో ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

తొమ్మిది ఎరువుల దుకాణాల లైసెన్స్‌లు రద్దు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల


మాట్లాడుతున్న విజయనిర్మల

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ మండలాల్లో ప్రభుత్వ ఎరువుల నియంత్రణ చట్టం 1985ను అతిక్రమించి నిర్వహిస్తున్న తొమ్మిది ఎరువుల దుకాణాల లైసెన్స్‌లను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల తెలిపారు. ఇందులో డోర్నకల్‌లో మూడు, కురవిలో రెండు, మరిపెడ, చిన్నగూడూరు, నెల్లికుదురు, మహబూబాబాద్‌లో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో విలేకరులతో ఆమె మాట్లాడారు. జిల్లాలో యూరియా కొరతను అధిగమించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్‌శాఖల తనిఖీల్లో అన్ని మండల కేంద్రాల్లో సహకార సొసైటీల్లో యూరియా నిల్వలను పకడ్బందీగా రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యాపారం నిర్వహిస్తున్న సాలార్‌తండాలోని ఈశ్వర్ ట్రేడర్స్‌కు షోకాజ్ మెమో ఇవ్వడం జరిగిందన్నారు. డీలర్లు ఇచ్చే యూరియా, ఇతర ఎరువుల నిల్వలను పకడ్బందీగా స్టాక్ రిజిస్టర్లలో ఈ-పాస్ మిషన్‌లలో పొందుపరిచి బిల్లుల రూపంలో రైతుకు ప్రతి బస్తా అందించాలని చెప్పారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే యశస్విని



పాలకుర్తిలో రాజీవ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పక్కన ఝాన్సీరెడ్డి

పాలకుర్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : భారతదేశాన్ని సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ అని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రాజీవ్ జయంతి సందర్భంగా రాజీవ్ విగ్రహానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ దేశంలో సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందిందంటే దానికి రాజీవ్ గాంధేనని అన్నారు. కాంగ్రెస్ నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, గడ్డం యాకసోమయ్య, కమ్మగాని నాగయ్య, పెనుగొండ రమేష్, కారుపోతుల శ్రీనివాస్, సలేంద్ర సంపత్, మామిండ్ల యాకయ్య, ఆకుల నాగరాజు, నర్సింహరావు ఉన్నారు.

● జనగామ రూరల్ (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు చెంచారపు బుచ్చిరెడ్డి, గంగం నర్సింహరెడ్డి, మేడ శ్రీనివాస్, బడికే ఇందిర, మల్లారెడ్డి పాల్గొన్నారు.

● నర్మెట (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను నర్మెట మండలకేంద్రంలో బుధవారం మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి, మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, గ్రామ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, మహిళ మండల అధ్యక్షురాలు దేవులపల్లి భాగ్యలక్ష్మి, నాయకులు పండ్ల బాలనర్సు, వలబోజు శ్రీనివాస్, తీగుళ్ల భూపతి తదితరులు పాల్గొన్నారు.

● దేవరుప్పుల (ఆంధ్రజ్యోతి):రాజీవ్‌గాంధీ దేశ అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో వారి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల మాజీ అధ్యక్షుడు సురేశ్‌బాబు, మండల యూత్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న, ఎస్టీ, ఎస్సీ, బీసీ సెల్ మండల అధ్యక్షులు సజ్జన్, నాగరాజు, గణేశ్ నాయకులు యాకస్వామి, ఓడపల్లి రవి, రెడ్డిరాజుల రమేశ్, రామచందర్ ఆయా గ్రామపార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.

● రఘునాథపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మేకల నరేందర్, గాదె మహేందర్ రెడ్డి, ఎండి.బాషుమియా, కడారి రవి, పేర్ని రవి, ఇబ్రహీం పాషనరేష్, అంజనేయులు, బుచ్చయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. కార్యక్రమంలో నాయకులు బూర్ల శంకర్, గన్ను నర్సింహులు, అంబటి కిషన్‌రాజ్, మారపాక వసంత్, సింగపురం వెంకటయ్య, చింత ఎల్లయ్య, దశరథ్‌నాయక్, గట్టు రమేష్‌గౌడ్, నక్క పాపయ్య, యాకుబ్‌పాషా, సంపత్ రాజ్, బూర్ల రాజు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



నర్మెటలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నర్మెట, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మేను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ మొహసీన్ ముజ్తబా అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లోని బాలికల హస్టల్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాకు రిజిస్టర్‌లను పరిశీలించారు. హస్టల్ వినియోగించే నిత్యావసర సరుకులను, భోజనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు తాజా కూరగాయాలతో నాణ్యమైన వంటలు అందించాలన్నారు. హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియాను అందుబాటులో ఉంచాలి

పాలకుర్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : యూరియాను రైతులను అందుబాటులో ఉంచాలని బీఆర్ఎస్ నాయకులు బుధవారం అధికారులను నిలదీశారు. మండల కేంద్రంలోని రైతు సేవా సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేస్తున్న కేంద్రానికి చేరుకొన్న బీఆర్ఎస్ నాయకులు మండల వ్యవసాయాధికారి శరత్‌చంద్రను కలిసి యూరియా స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ మాట్లాడారు. అదే విధంగా సీపీఎం మండల కమిటీ నాయకులు సైతం యూరియా పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో చిట్యాల సోమన్న, సోమ సత్యం, బీఆర్ఎస్ నాయకులు కడుదుల కర్ణాకర్‌రెడ్డి, మహేందర్ ఉన్నారు.

బోధనోపకరణాలతో పాఠ్యాంశం సులభతరం

నర్మెట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బోధనోపకరణాలతో బోధన సులభతరంతో పాటు విద్యార్థికి పాఠ్యాంశం త్వరగా అర్థమవుతుందని మండల విద్యాశాఖ అధికారి అయిలయ్య అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మండల స్థాయి టీఎల్ఎం(కృత్యమేళా) నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు తమ బోధనోపకరణాలను ప్రదర్శించారు. మండల స్థాయి కృత్యమేళా విజేతలు జిల్లా స్థాయిలో జరిగే కృత్యమేళాలో పాల్గొనన్నుట్లు తెలిపారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి బి. శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నీలం వేణు, గోపాల్‌రెడ్డి, కమల, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

జనగామ రూరల్ 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం ప్రతినిధి డాక్టర్ లవకుమార్ రెడ్డి అన్నారు. లవకుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బండ భిక్షపతి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. లయన్ ప్రతినిధి గాందె కృష్ణ మోహన్ జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని వృద్ధాశమంలో వృద్ధులకు అల్పాహారం అందించారు. లయన్స్ ప్రతినిధులు భైరు వెంకటేశ్వర్లు, రామిని శ్రీనివాస్, కాముని వెంకటవరప్రసాద్, నర్సిరెడ్డి, శ్రీనివాస్ బాబు, వేణుగోపాల్‌రెడ్డి, బాల్దే మల్లేశం, యాట వెంకటేశ్వర్లు, హెచ్ఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లకు వేళాయె

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించింది. ఈ రిజర్వేషన్లను జిల్లాల వారీగా ఆయా జిల్లాల కలెక్టర్లు డ్రా పద్ధతిని నిర్ణయించిస్తారు. కాగా.. గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం చొప్పున షాపులు దక్కనున్నాయి. జనగామ జిల్లావ్యాప్తంగా 47 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇందులో రిజర్వేషన్ ప్రాతిపదికన గౌడ సామాజిక వర్గానికి 13, ఎస్సీలకు 5, ఎస్టీలకు ఒక షాపు రిజర్వ్ కానుంది. మిగతా 28 దుకాణాలను ఓపెన్ కేటగిరీ కింద ఉంటాయి.

భారీగా దరఖాస్తు ఫీజు పెంపు

మద్యం దుకాణాలకు టెండర్లు దాఖలు చేయాలనుకున్న ఔత్సాహికులకు ప్రభుత్వం ఒకింత నిరాశను కలగజేసింది. టెండర్ల రూపంలో ఆదాయాన్ని పెంచుకోవాలన్న ఆలోచనతో ఉన్న ప్రభుత్వం టెండరు ఫీజును రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలకు పెంచింది. దీంతో కొత్తగా దరఖాస్తులు చేసుకోవాలని ఉత్సాహంతో ఉన్న వారు వెనుకడుగు చేసే అవకాశం ఉంది. గతంలో రూ. 2 లక్షలు ఉండగా ప్రస్తుతం ఏకంగా రూ. ఒక లక్ష పెంచి రూ. 3 లక్షలు చేసింది. దీంతో కొంత మేర దరఖాస్తులు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగం దివాళా తీయడంతో మద్యం దుకాణాల టెండర్లకు దరఖాస్తు లు తక్కువగానే వస్తాయని మద్యం దుకాణాల నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ సమయంలో దరఖాస్తు ఫీజును రూ. 3 లక్షలకు పెంచడంతో దరఖాస్తులు ఇంకా తగ్గుతాయని అంటున్నారు. దరఖాస్తులు తక్కువగా వస్తాయని ముందే భావించిన ప్రభుత్వం గతేడాది వచ్చిన ఫీజును రాబట్టుకోవాలనే ఆలోచనతో ప్రభుత్వం ఫీజు పెంచి ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. గత ఏడాది జిల్లాలో 47 మద్యం దుకాణాలకు గానూ 2356 దరఖాస్తులు రాగా రూ. 47.12 కోట్ల ఆదాయం సమకూరింది. కాగా ఈసారి అంత మొత్తంలో దరఖాస్తులు రావని మద్యం దుకాణాల యజమానులు అభిప్రాయపడుతున్నారు.

యథావిధిగా ఎక్సైజ్ ట్యాక్స్

- దరఖాస్తు ఫీజు పెంచినప్పటికీ ఎక్సైజ్ ట్యాక్స్‌ను మాత్రం ప్రభుత్వం యథావిధిగా ఉంచింది. గతంలో ఉన్నట్లుగానే 5 వేల జనాభా లోపు ఉన్న షాపులకు రూ. 50 లక్షలు, 5 వేల నుంచి 50 వేల లోపు జనాభా ఉన్న షాపులకు రూ.55 లక్షలు, 50 వేల నుంచి లక్ష జనాభా కలిగి ఉన్న షాపులకు రూ. 60 లక్షలు, ఒక లక్ష నుంచి 5 లక్షల జనాభా ఉన్న షాపులకు రూ. 65 లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల వరకు జనాభా ఉన్న దుకాణాలకు రూ. 85 లక్షలు, 20 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న షాపులకు రూ. ఒక కోటి 10 లక్షలుగా ఎక్సైజ్ ట్యాక్స్‌ను ప్రభుత్వం నిర్దేశించింది.

అనుమతి లేని కేబుల్ వైర్లను తొలగిస్తాం : ఎన్పీడీసీఎల్ డీఈ

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలకు ఎలాంటి అనుమతి లేకుండా కేబుల్ వైర్లను ఏర్పాటు చేస్తే తొలగించడం తప్పదని ఎన్పీడీసీఎల్ డీఈ వై. రాంబాబు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో సబ్ డివిజన్ కార్యాలయంలో కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈ పలు సూచనలు చేశారు. అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాల పైన విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన కేబుల్ చుట్టలను వెంటనే తీసివేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ రణధీర్ రెడ్డి, ఏఈలు పి. శంకర్, శివకుమార్, సబ్ ఇంజనీర్లు సాధన రెడ్డి, హరిత, ఫోర్‌మెన్ రాజేందర్, లైన్మెన్‌లు వాసం శ్రీధర్, ఎమ్డీ అన్వర్‌పాషా, అల్లం సదన్, సురేందర్ రెడ్డి, యుగేందర్, ఏఎల్ఎం నాగరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఆపరేటర్లకు సూచనలు ఇస్తున్న ఎన్పీడీసీఎల్ డీఈ రాంబాబు

సంక్షేమ గురుకులంలో వైద్య పరీక్షలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఒక విద్యార్థికి డెంగ్యూ జ్వరం లక్షణాలు కనిపించాయని దృష్టికి రావడంతో బుధవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. పారిశుధ్యం పనులను పరిశీలించారు. దోమల నివారణ మందు ఫైరిత్రేన్‌ను పిచికారి చేయించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను చదును చేయించారు. జ్వర లక్షణాలు ఉన్న 44 మందిని వైద్యులు పరిక్షించారు. మందులు అందించారు. వైద్యులు విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రుబీనా, డాక్టర్ పవన్, సీహెచ్‌ఓ చింత వెంకటస్వామి, శేషయ్య, ప్రేమలత, ప్రిన్సిపాల్ బి.రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి

దేవరుప్పుల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన మామీలకు అనుగుణంగా ఉపాధ్యాయుల, ఉద్యోగుల సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరుచాలని పీఆర్‌టీయు టీఎస్ సంఘం మండల అధ్యక్షుడు అంబటి అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ ఎదుట సెప్టెంబర్ 1 తేదీన నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్ర విద్యావనరుల కార్యాలయంలో ఎంఈవో కళావతి బుధవారం ఆవిష్కరించారు. మండలశాఖ ప్రధాన కార్యదర్శి గోలి తిరుపతి రెడ్డి, రాష్ట్ర బాధ్యులు వనం లక్ష్మణ్‌రావు, దోసపాటి శ్రీనివాస్, మదన్మోహన్‌రెడ్డి, శోభారాణి, మెతుకు రాజు, బైరి అశోక్, దాసరి వెంకన్న, పద్మావతి, రామన్న, మాధవి పాల్గొన్నారు.

పారిశుధ్య నివారణకు చర్యలు చేపట్టాలి



వడ్డెగూడెంలో సమస్యలపై సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

జఫర్‌గఢ్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆయా వార్డుల్లో పారిశుధ్య నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో జఫర్‌గఢ్, శివారు వడ్డెగూడెంతో పాటు మండలంలోని తమ్మడపల్లి(జి)లోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమాల్లో సీపీఎం నేతలు కాట సుధాకర్, వీకే.సుధాకర్, శ్రీను, సాకి నర్సింగం, తాటికాయల రేణుక, చిరంజీవి, అప్సర్, అలీం, వెంకటేశ్, వేల్పుల పెద్ద రాములు, వెంకన్న, నర్సమ్మ, సోమయ్య, సరిత పాల్గొన్నారు.

గొడవలు లేకుండా పండుగలు జరపాలి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మత విద్వేశాలకు తావు లేకుండా అన్ని మతాలకు చెందిన వారు సోదరభావంతో పండుగలను శాంతియుత మార్గంలో జరుపుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ సీఐ జీ. వేణు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో వివిధ మతాలకు చెందిన మత పెద్దలు, వినాయక ఉత్సవాలు నిర్వహించే నిర్వహాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఇతర మతస్తులకు ఇబ్బందులు కల్గే చర్యలకు పాల్పడకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు వినయ్‌కుమార్, రమేష్, రాజేష్, మనిషా, నాయకులు రహమతుల్లా, ఏసుబాబు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



మల్కాపూర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

చిలుపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాస ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మల్కాపూర్, కృష్ణాజీగూడెం, చిలుపూర్ తదితర గ్రామాల్లో బుధవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలంతా అత్యంత భక్తిశ్రద్ధలతో, డప్పుచప్పుళ్ళ మధ్య బోనాలతో ఆలయాలకు చేరుకున్నారు. గ్రామ దేవత అయినటువంటి పోచమ్మకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ప్రేమలత, పోలేపల్లి మాధవి, సంధ్య, రమాదేవి, నాయకమ్మ, రాజమ్మ తదితర మహిళలు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి

చిలుపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : యువత స్వయం ఉపాధిపై ప్రత్యేక దృష్టిసారించి ఆర్థికాభివృద్ధి సాధించాలని సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నపెండ్యాలలో స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్‌తో కలిసి ట్రావెల్స్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుంపుల రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ తాళ్ళపల్లి సంపత్‌కుమార్, జనగామ యాదగిరి, ఏడవెల్లి మల్లారెడ్డి, చిలుపూర్ గుట్ట మాజీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, మాజీ డైరెక్టర్ గజ్జెల దామోదర్, తాళ్ళపల్లి క్రాంతికుమార్, ఇల్లందుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం



పూజలు చేస్తున్న రాంబాబు తదితరులు

రఘునాథపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అభయాంజనేయ స్వామి మూడో వార్షికోత్సవ వేడుకలను మండల కేంద్రంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభయాంజనేయ స్వామి విగ్రహ దాతలు బచ్చు చిరంజీవి- బాలేశ్వరి, బచ్చు శ్రీధర్-ప్రియాంక దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, బొల్లం అజయ్‌మణికంఠ, బాషుమియా, కోళ్ల రవి, పూజారి పిండిప్రోలు శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో మాక్ పోలింగ్

జఫర్‌గఢ్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాఠశాలలో హెడ్ బాయ్, గర్ల్‌తో పాటు డిప్యూటీ హెడ్ బాయ్, గర్ల్ విభాగాల్లో పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ఆయా పదవులకు పలువురు విద్యార్థినీ విద్యార్థులు పోటీ పడగా, విద్యార్థులు బారులు తీరి ఓటు వేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీకాంత్ మాట్లాడారు. కాగా ఓటింగ్ అనంతరం నిర్వహించిన ఓట్ల లెక్కింపులో ఆయా విభాగాల పదవులకు బొజ్జు గణేష్, దుబ్యాల శివాని, గంధం రామ్‌చరణ్, మోరె కోమలతలు ఎన్నికైనట్లు ప్రకటించారు.

రైతులకు వెంటనే యూరియాను అందించాలి

రఘునాథపల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ అన్నారు. రైతులకు యూరియా పంపిణీ చేయలేదని సీపీఎం నాయకులు మండల కేంద్రంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పొదల నాగరాజు, కడారి అంజనేయులు, అరూరి యాదగిరి, లవకుమార్, మల్లేష్, దేవేందర్ పాల్గొన్నారు.

● బచ్చన్నపేట (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ను సీపీఎం బృందం సందర్శించి యూరియా నిలువలను పరిశీలించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు యూరియా కోసం గోస పడుతుంటే, ప్రభుత్వం నిలువలున్నాయంటూ తప్పుదారి పట్టించటం సరికాదన్నారు. సరిపడా యూరియా అందించే వరకు ఆందోళనలు తప్పవన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, అశోక్, ఎల్లయ్య, సమ్మయ్య, కనకాచారి తదితరులున్నారు



బచ్చన్నపేటలో పీఏసీఎస్‌ను సందర్శించిన సీపీఎం బృందం

25న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

జనగామ కల్చరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16, 18, 20 ఏళ్ల విభాగంలో బాలబాలికలకు అథ్లెటిక్స్ నిర్వహిస్తారని, ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30, 31 తేదీలలో జరిగే 11వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల వారు 25న ధర్మకంచ మినీ స్టేడియంలో హాజరు కావాలన్నారు.

వర్షాలకు కూలిన ఇల్లు

బచ్చన్నపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బండారు చంద్రయ్యకు చెందిన ఇల్లు మంగళవారం రాత్రి కూలిపోయింది. ఇంటి ముందున్న రూంలో నిద్రిస్తుండగా, ఇంటి వెనుక వైపు ఉన్న గది అర్ధరాత్రి పెద్ద శబ్ధంతో కూలిపోయింది. గత కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండఇంతో పెంకుటిల్లు గోడలు తడిసి కూలిపోయిందన్నారు. కాగా బాధిత కుటుంబానికి ఇందిరమ్మ రెండో విడత ఇళ్లల్లో మంజూరుకు ప్రాధాన్యతనిస్తామని కాంగ్రెస్ పార్టీ నేత నల్లగోని బాలకిషన్‌గౌడ్ తెలిపారు.

విద్యార్థి చదువుకు వైద్యుల చేయూత

పాలకుర్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దతండా (కే) గ్రామ నిరుపేద కుటుంబానికి చెందిన భూక్యా వంశీ ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకునేందుకు అడ్మిషన్ ఫీజు చెల్లించలేని స్థితిలో ఉండడంతో పాలకుర్తికి చెందిన వైద్యులు డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో బుధవారం రూ. 22 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. డాక్టర్ చిదురాల మహేందర్, డాక్టర్ కోటేష్, బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశ్వర్లు, సంతోష్ అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చిలుపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కొండాపూర్ గ్రామాన్ని సందర్శించిన ఆయన స్థానిక ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, మద్యపానం, పేకాట, బెట్టింగ్ యాప్స్ తదితర దురలవాట్ల గురించి విద్యార్థులకు వివరించారు. హెచ్ఎంతో పాటు, ఉపాధ్యాయ సిబ్బంది, వీసీలు వీరన్న పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

జనగామ రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచకు చెందిన చెరుకూరి శ్రీనివాస్ గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న నాగపురి కిరణ్ కుమార్ బాధిత కుటుంబానికి బుధవారం రూ. 2,50,000 ఎల్‌వోసీని అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్‌తో నిరుపేదల ప్రాణాలు నిలుస్తున్నాయన్నారు.

కాలువల మరమ్మతుకు నిధులు మంజూరు

బచ్చన్నపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బండనాగారం- లక్ష్మాపూర్ శివారులోని గోదావరి పైప్‌లైన్ డీపీ పాయింట్ నుంచి కొడవటూరు మీదుగా పలు చెరువుల్లోకి గోదావరి జలాలు తరలించే పనుల నిర్వహణకు రూ. 10.35 లక్షల నిధులు మంజూరైనట్లు ఇరిగేషన్ ఈఈ మంగీలాల్ తెలిపారు. ఇందుకు సంబంధించిన సర్వేను బుధవారం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పనుల ద్వారా కొడవటూరు చెరువుతో పాటు బచ్చన్నపేట తాళ్ల చెరువు, గుడి చెరువు, చింతలకుంట చెరువులు నిండే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రవణ్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు గంగం సతీష్‌రెడ్డి, కోళ్ల నర్సిరెడ్డి, నీల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్రిడ్జి మరమ్మతు పనులను చేపట్టాలి

జనగామ రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు సమీపంలోని బ్రిడ్జి మరమ్మతు పనులను చేపట్టాలని సీపీఎం నాయకులు బుధవారం మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోపి, మంగ బీరయ్య, హజరుద్దీన్, చిదురాల ఉపేందర్, సుధాకర్, బండ సౌందర్య, మహేశ్వరి అంజలి తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

చిలుపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీపతిపల్లి నుంచి కొండాపూర్ వెళ్ళే మార్గంలో ఏర్పడ్డ గుంతలను స్థానికులు స్వచ్ఛందంగా పూడ్చివేశారు. బుధవారం శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా బోనాల పండుగ నిర్వహిస్తున్నారు. పోచమ్మ ఆలయానికి వెళ్ళే రోడ్డు గుంతలమయంగా మారి నడకదారి సైతం ఇబ్బందికరంగా తయారైంది. ఈ క్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రంగు రమేష్ రూ 10 వేలను వెచ్చించి ట్రాక్టర్లతో గుంతలపై మట్టి పోయించి డోజర్లతో చదును చేయించారు. చిలుపూర్ గుట్ట డైరెక్టర్ మోతె మహేశ్, పల్లపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

జనగామ మునిసిపల్ కమిషనర్‌గా డి.మహేశ్వర్‌రెడ్డి

జనగామ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జనగామ మునిసిపల్ కమిషనర్ గా డి.మహేశ్వర్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు మునిసిపల్ పురపాలక శాఖ డైరెక్టర్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకటేశ్వర్లుకు ప్రస్తుతం ఎక్కడా పోస్టింగ్ కేటాయించలేదు. వెయిటింగ్ లీస్టులో ఉన్న మహేశ్వర్‌రెడ్డిని జనగామ మునిసిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

చెరువులు నింపాలని రోడ్డెక్కిన రైతులు

(5వ పేజీ తరువాయి)

పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దేవాదుల ద్వారా చెరువులు నింపాలని ఇరిగేషన్ ఈఈ మంగీలాల్‌కు అనేక మార్లు విన్నవించినా కూడా పట్టించుకోకుండా రైతులను అవమానపరుస్తూ కించపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి, ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, స్థానిక ప్రజప్రతినిధులు చెప్పినా తనకు ఏమి కాదని ఇష్టరాజ్యంగా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. రైతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఈఈ మంగీలాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి జనగామ సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు రాజేశ్ కుమార్, చెన్నకేశవులు చేరుకొని రైతులను శాంతిపజేసి అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడించి మూడు రోజుల్లో సాగునీరు అందిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించుకున్నారు. అనంతరం ఈఈ మంగీలాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో క్రిష్ణస్వామి, బుచ్చిరెడ్డి, మహిపాల్, జైపాల్, జయ ప్రకాశ్, జగదీశ్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.